సంగారెడ్డి జిల్లాకు 92 మంది లెక్చరర్లు

సంగారెడ్డి అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు కొత్తగా 92 మంది రెగ్యులర్ జూనియర్ లెక్చరర్లు నియమితులయ్యారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,500 మంది విద్యనభ్యసిస్తున్నారు. కొన్నేళ్లుగా రెగ్యులర్ లెక్చరర్ల నియామకం లేకపోవడంతో ఐదుగురు కాంట్రాక్టు, 97 మంది గెస్ట్ లెక్చరర్లతో నెట్టుకొచ్చారు. 13 ఏళ్ల తర్వాత ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టడంతో ఇంటర్ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల కొరత తీరనుంది.



సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకల్లో కలెక్టర్ క్రాంతి



కామదహనం.. హోలీ సంబరాల్లో జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని రాంమందిర్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన కామదహనం కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. ప్రజలతో కలిసి కామదహనం నిర్వహించారు. తన చిన్ననాటి మిత్రులు, స్థానికులతో ఉత్సహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా శుక్రవారం ఉదయం రాంమందిర్ సమీపంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి స్థానికులతో కలిసి రంగులు చల్లుకుని ఉల్లాసంగా, ఉత్సహంగా చిందులు వేశారు. దాదాపు మూడు గంటల పాటు హోలీ వేడుకల్లో పాల్గొని ఉట్టి కొట్టారు.







చమ్మకేళీల హోలీ

అంబరాన్నంటిన సంబరాలు



మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో శుక్రవారం కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య హోలీ సంబరాలు జరుపుకున్నారు. చిన్నా.. పెద్ద.. యువతీయువకులు రంగుల్లో మునిగితేలారు. రంగులు పూసుకుంటూ.. డ్యాన్సులు చేస్తూ ఆకాశమే హద్దుగా ఎంజాయ్ చేశారు. రాజకీయ నాయకులు, అధికారులు ప్రజలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. మెదక్‌లోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ నాయకులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ పరితోశ్ పంకజ్ అధికారులు, సిబ్బందితో కలిసి హోలీలో పాల్గొన్నారు. హోలీ ఉత్సవాల్లో భాగంగా నారాయణఖేడ్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో గుండు ఎత్తే పోటీలు నిర్వహించారు. యువకులు 100 కేజీలకు పైగా రాతి గుండ్లను ఎత్తి భళా అనిపించారు.



సంగారెడ్డిలో ఏఎస్పీ సంజీవరావుకు రంగు పూస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్



ఉద్యోగులతో హోలీ వేడుకల్లో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



సంగారెడ్డిలో చిన్నారుల జోష్



మెదక్‌లో హోలీ వేడుకల్లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రంజాన్ వేళలు

శనివారం ఇఫ్తార్: సాయంత్రం 6.31

ఆదివారం సహర్: ఉదయం 5.02



తెల్ల కుసుమతో తెగ లాభాలు

కోహీర్ మండలంలో రైతుల మొగ్గు

తక్కువ పెట్టుబడి.. నీటితో పంట

జొన్న, శనగలో అంతర పంటగా సాగు 7

పట్టుదలతో సాగు

మీర్జాపూర్‌లో పదేళ్లుగా పట్టు పురుగుల పెంపకం

నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి అందని ప్రోత్సాహకం 7

అయినా ధైర్యంతో ముందడుగు

లాభాలను ఆర్జిస్తున్న దంపతులు

'ఫైర్'డే



ఎండ @ 40.4 డిగ్రీలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడి భగభగలు
- సంగారెడ్డి జిల్లా జిన్నారం, దిగ్వాల్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- ఎండవేళ జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

మెదక్/మెదక్ అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మార్చి రెండో వారంలోనే 40 డిగ్రీలు దాటేశాయి. ఉదయం 8 గంటల నుండే భానుడు భగ్గుమంటున్నాడు. రాత్రి 6 గంటల వరకు తీవ్రత కొనసాతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు మండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాంతో ఎండ. వడ గాల్పులు, ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జిన్నారం, దిగ్వాల్ 40.4 డిగ్రీల సెంట్రిగేడ్ నమోదు కాగా.. మెదక్ జిల్లాలోని కాగజ్ మద్దూర్‌లో 39.6, సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేట, బెజ్జంకిలో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్న వేళ్లల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటోందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న ఎండలకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో జిన్నారం, దిగ్వాల్‌కు వాతావరణ శాఖ ఆరెంట్ ఆలర్ట్ జారీ చేయగా.. పలు మండలాలతోపాటు మెదక్, సిద్దిపేట జిల్లాలోని పలు మండలాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా...

సంగారెడ్డి జిల్లా జిన్నారం, దిగ్వాల్‌లో అత్యధికంగా 40.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదు కాగా.. కడ్తాల్ అల్గోల్ 39.4 నిజాంపేట 39.3, కల్హేర్ 39.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేట, బెజ్జంకి 39.8, రాఘవపూర్ 39.7, దుల్మిట్ట 39.6, నంగునూర్, కోహెడ, తిప్పారం 39.5, గండిపల్లి39.4, హబ్సీపూర్, చిట్యాల 39.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలోని కాగజ్ మద్దూర్ 39.6, కొత్తపేట 39.5, నర్సాపూర్ 39.4, కొల్చారం 39.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



భూగర్భ జలాలు అడుగంటడంతో పొట్టకొచ్చిన పొలం గొర్రెలకు మేతయింది. ఎంతో ఆశతో సాగు చేసిన రైతు గుండె బరువెక్కింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌కు చెందిన ముంద్రాయి కిష్టాగౌడ్ బోరు కింద ఎకరా పొలం నాటు వేశారు. బోరు ఎండిపోయి పొలం నెర్రెలు బారడంతో గొర్రెలకు మేతగా వదిలేశారు. -కౌడిపల్లి, (ఆంధ్రజ్యోతి)

మండుతున్న ఎండలు.. గిర్రుమంటున్న మీటర్లు

రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగం

సంగారెడ్డి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో అదే స్థాయిలో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతున్నది. గృహ వినియోగంతో పాటు పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ మోటార్లను నిరంతరాయంగా వాడుతుండడంతో డిమాండ్ విపరీతంగా పెరిగింది. మార్చి రెండో వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రెండు నెలల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో, డిమాండ్‌ను తట్టుకునేలా విద్యుత్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది.

10 లక్షల యూనిట్లు అదనం

సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ సాగు అధికంగా విద్యుత్ వినియోగంపైనే ఆధారపడింది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా వందలాది పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయి. ఈ నేథ్యంలో విద్యుత్ డిమాండ్ ఎప్పటికప్పుడూ పెరుగుతూనే ఉన్నది. గతేడాది ఇదే సమయంతో పోల్చితే నిత్యం సగటున పది లక్షల యూనిట్ల మేర వినియోగం పెరిగింది. జిల్లాకు కేటాయించిన కోటా 13.500 మిలియన్ యూనిట్లు కాగా, ఈ నెలలో ప్రతీ రోజు సగటున 16.353 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నారు. జిల్లాకు కేటాయించిన కోటా కంటే నిత్యం 2.858 ఇలియన్ యూనిట్ల విద్యుత్ అదనంగా వినియోగిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతున్నది.

తేదీ	విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లు)
5	16.592
6	16.405
7	16.602
8	16.384
9	16.661
10	16.798
11	17.756
12	17.605
13	17.788
14	17.950

సంగారెడ్డి జిల్లాలో 8,27,181 విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో మొత్తం 8,27,181 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ సర్వీసులు 1,06,159, గృహ సముదాయాలకు 6,22,122, వాణిజ్య ఉపయోగం 77,968, పరిశ్రమలు 5,516, దోబీగాట్లు 108, వీధిలైట్లు, వాటర్ సప్లయ్ 10,334, ఇతర విభాగాలకు 4,902 కనెక్షన్లు ఉన్నాయి.

మెదక్ జిల్లాలో అధికంగా విద్యుత్ వినియోగం

మెదక్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎండలు పెరుగుతుండటంతో మెదక్ జిల్లాలో విద్యుత్ వినియోగం పెరుగుతున్నది. గతంతో పోలిస్తే చెల్లించిన బిల్లు మొత్తం పెరగడమే ఇందుకు నిదర్శనం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో ఈ ఏడాది విద్యుత్తు అధికంగా వినియోగిస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. గత ఫిబ్రవరిలో గృహ అవసరాల బిల్లు జిల్లాలో రూ.4.13కోట్ల డిమాండ్ ఉండగా, మార్చిలో 29 శాతం పెరిగి రూ.5 కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. వాణిజ్య అవసరాలకు ఫిబ్రవరిలో రూ.4.53 కోట్ల డిమాండ్ ఉండగా, మార్చిలో 10 శాతం పెరిగి రూ.5 కోట్లకు చేరే అవకాశాలున్నట్లు అంచనా వేస్తున్నారు.

హోటల్‌కు నిప్పంటించిన దుండగులు

నారాయణఖేడ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలం రుద్రారం చౌరస్తా వద్ద తనుగు నర్సింలు హోటల్‌కు శుక్రవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. అటుగా వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన పలితం లేకుండా పోయింది. హోటల్ మొత్తం కాలిబూడిదయ్యింది. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ రూ.50వేల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చర్మంపై స్పర్శలేని మచ్చలున్నాయా?

- 'ఎల్‌సీడీసీ' పేరిట ఆరోగ్య శాఖ ఇంటింటికి
- ఈ నెల 17 నుంచి 30 వరకు ఆశాల సర్వే
- సర్వే ద్వారా 'కుష్ఠు' అనుమానితుల గుర్తింపు
- వ్యాధి నిర్ధారణకు పీహెచ్‌సీ డాక్టర్ల వద్దకు సిఫారసు
- కార్యాచరణ రూపొందించిన వైద్య ఆరోగ్య శాఖ



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి రానున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)పేరిట వైద్య ఆరోగ్య శాఖ సర్వే నిర్వహించనున్నది. 17 నుంచి 30 వ తేదీ వరకు ఆశా వర్కర్లు సర్వే చేయనున్నారు. ఏటా చర్మ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టే ఈ కుష్ఠు వ్యాధి చాప కింద నీరులా విస్తరించి భయాందోళనకు గురిచేస్తున్నది. దీనిని ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఇదే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఎల్‌సీడీసీ పేరిట కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే నిర్వహిస్తోంది.

గతేడాది మొక్కుబడిగా సర్వే

గతేడాది డిసెంబరులో ఎల్‌సీడీసీ పేరిట సర్వే నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలో 15,27,628 మంది జనాభాలో ఉంటే 1,70,129 మందిని మాత్రమే సర్వే చేశారు. అందులో 138 మంది కుష్ఠు అనుమానితులను గుర్తించారు. రెండేళ్ల నుంచి ఆశాలకు సర్వే డబ్బులు ఇవ్వక పోవడంతో విముఖత చూపారు. అధికారుల ఒత్తిడితో కొందరు ఆశాలు మొక్కుబడి సర్వే చేశారనే ఆరోపణలు వచ్చాయి. తాజాగా మళ్లీ సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యాచరణ రూపొందించింది.

సర్వేకు సహకరించాలి



జిల్లాలో ఈ నెల 17 నుంచి ఎల్‌సీడీసీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే మెడికల్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చాం. కుష్ఠు అనుమానితులను గుర్తించి వారిందరికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందిస్తాం. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారు. సర్వేకు వచ్చే ఆశాలకు ప్రజలు సహకరించాలి.

డా.మహేందర్‌రెడ్డి, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్, సంగారెడ్డి

ఆశాలతో ఇంటింటి సర్వే

జిల్లాలోని పట్టణ, గ్రామాల్లోని ప్రతి ఇంటింటి ఆశా వర్కర్లు వెళ్లి సర్వే చేస్తారు. జిల్లాలోని 34 ఆరోగ్య కేంద్రాల పరిధులలో 934 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. సర్వే చేసినందుకుగాను ప్రతి ఆశా కార్యకర్తకు ఒక రోజుకు రూ.75 చొప్పున చెల్లిస్తారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా ప్రతి ఆశా కార్యకర్త ఒక్కో రోజు రూరల్ ఏరియాలో 20-25 ఇళ్లు, అర్బన్ ఏరియాల్లో 25-30 ఇళ్లను సర్వే చేస్తారు. సమస్యలుంటే ఆశాలు సర్వే ద్వారా వివరాలు నమోదు చేసుకుంటారు. వీరిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని మరోసారి లెప్రసీ బృందం చేత పరీక్షలు చేయిస్తారు. వ్యాధి ఉన్నట్లు తేలితే ఎండీటీ డ్రగ్స్ లెప్రసీ చికిత్స ప్రారంభిస్తారు.

ఉర్సుకు ముస్తాబైన దస్తగిర్ దర్గా

పుల్‌కల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లోని ఆశం దస్తగిర్ దర్గా ఉర్సు ఈ నెల 16న నిర్వహించనున్నారు. ఈ మేరకు దర్గాను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఉత్సవాలకు అన్నసాగర్ పీఠాధిపతి ఖలీల్ హస్సేన్, జోగిపేటకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు డాక్టర్ రజాక్ అలీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు కవ్వాలి, గంధం, సాయంత్రం అన్నదాన వితరణ ఉంటుందని దర్గా నిర్వహకులు అహ్మద్ అలీ ఉర్ఫ్ నారాయణగౌడ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



చౌటకూర మండలంలోని ఆశం దస్తగిర్ దర్గా

జహీరాబాద్‌కు చేరిన

దత్తగిరి మహారాజ్ పాదయాత్ర

జహీరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : దత్తగిరి మహారాజ్ 46వ వార్షిక అమరతిథి సందర్భంగా చేపట్టిన పాదయాత్ర శుక్రవారం జహీరాబాద్ పట్టణానికి చేరుకున్నది. ఈ నెల 9న నారాయణఖేడ్‌లోని బెల్లాపూర్ ఆశ్రమం నుంచి ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం జహీరాబాద్‌కు వచ్చింది. 16న ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమానికి చేరుకుంటుంది. మానవులందరు సుఖశాంతులతో జీవించుటకు, ఆధ్యాత్మిక చింతనతో శాంతికాముకులై ధర్మబద్ధులై ఉండుటకుగాను యాత్ర చేపట్టినట్లు డా.సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. కొత్తూర్‌కు చేరుకున్న పాదయాత్రకు మాజీ సర్పంచ్ జగన్మోహన్, స్థానికులు ఘన స్వాగతం పలికారు.



సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌తో భక్తులు

తాడిచెట్టుపై నుంచి పడి

గీత కార్మికుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్‌గౌడ్

నంగునూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండంరాజుపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లూరి మోహన్‌గౌడ్ శుక్రవారం ఎప్పటిలాగే గ్రామ సమీపంలోని తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో వెన్నుపూసకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే ఆయనను చికిత్స కోసం ఆస్పత్రి తరలించారు. కల్లు గీత వృత్తిపైనే ఆధారపడిన మోహన్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుండెపోటుతో ఎమ్మార్పీఎస్ నాయకుడి మృతి

హత్నూర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ యువసేన సంగారెడ్డి జిల్లా కన్వీనర్ కోటగళ్ల శివరామకృష్ణ (28) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందాడు. దళితుల సమస్యల పరిష్కారం కోసం పని చేసిన శివరామకృష్ణ చిన్న వయసులోనే ఎంతో మంది మన్ననలు పొందారు. దళిత రత్న అవార్డు కూడా పొందారు. శుక్రవారం ఆయన స్వగ్రామమైన శేర్ఖాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో మండల ప్రజలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాళ్లకల్‌లో వృద్ధుడి అదృశ్యం



కూతురి శంకర్‌గౌడ్(ఫైల్)

మనోహరాబాద్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గొడవతో వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని కాళ్లకల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన కూతురి భూలక్ష్మి, శంకర్‌గౌడ్ భార్యాభర్తలు. 20 రోజుల క్రితం భార్యాభర్తలకు వ్యాపారం విషయంలో గొడవ జరిగింది. శుక్రవారం ఉదయం కూతురి శంకర్‌గౌడ్ బయటకు వెళ్లి వస్తానాన్ని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు శంకర్‌గౌడ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తున్నది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. కూమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసురేని దర్యాప్తు చేస్తున్నారు. బయటకు వెళ్లినప్పుడు తెలుపు కలర్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ వేసుకున్నాడు. విషయం తెలిసిన వారు పోలీసులకు తెలపాలని కోరారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి



చంద్రయ్య మృతదేహం

కొండపాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి).. ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. తిమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సార్లవాడకు చెందిన చంద్రయ్య (60) శుక్రవారం ఉదయం రాజీవ్ రహదారి పక్కన ఉన్న హోటల్లో టీ తాగడానికి నడుచుకుంటూ వెళ్లాడు. అదే సమయంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు అజాగ్రత్తగా అతివేగంగా వెళ్తూ చంద్రయ్యను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. దాంతో చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకొని కింద పడిపోయిన చంద్రయ్యను లేపి పక్కన కూర్చుండబెట్టి చూడగా మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపాడు.

బైక్ అదుపు తప్పి యువకుడు..



ప్రశాంత్ (ఫైల్)

తొగుట. మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన బెజ్జనమైన ప్రశాంత్ (28) మోటర్ సైకిల్‌పై అల్వాల నుంచి వెంకట్రావ్‌పేట గ్రామానికి వస్తుండగా బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొన్నాడు. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి అతడిని చికిత్స కోసం హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. దాంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రశాంత్‌కు భార్య వర్షిని, కూతురు శన్విక, కొడుకు శశాంక్, తండ్రి కిష్టయ్య ఉన్నారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



శివరాజ్ (ఫైల్)

చిన్నశంకరంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి కావడం లేదని ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన పిరంగల్ల యశోధ యాదగిరి దంపతుల రెండో కుమారుడు శివరాజ్(24)కు సంవత్సరం నుంచి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎన్ని సంబంధాలు చూసిన కుదురడంలేదు. తన స్నేహితుల కంటే వయస్సులో పెద్దవాడినని తనకు పెళ్లి ఎందుకు కుదురడంలేదని శివరాజ్ కొన్ని రోజుల నుంచి మనోవేదనకు గురయ్యాడు. గురువారం రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనం చేశాడు. తను కౌలుకు సాగుచేస్తున్న పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి గడిచిపోతున్న శివరాజ్ ఇంటికి రాలేదు. శివరాజ్ ఆచూకీ కోసం తండ్రి యాదగిరి, భూయాజమాని బండారు సత్యనారాయణ ఇద్దరు కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు తాడుతో ఉరేసుకొని కనిపించాడు. శివరాజ్ మృతితో హోలీ పండగా పూట విషాదం నెలకొన్నది. తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ గౌడ్ తెలిపారు.

బ్రిడ్జి గోడపై నుంచి జారిపడి ఒకరి మృతి



శివరాజ్ (ఫైల్)

చేగుంట మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ప్రమాదవశాత్తు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి గోడపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చేగుంట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన పులబోయిన శేఖర్(26) వ్యవసాయంతో పాటు మండల కేంద్రంలో సౌండ్ సిస్టం వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. గురువారం సాయంత్రం బావి దగ్గరికి వెళ్తానని వెళ్లిన శేఖర్ రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. శుక్రవారం ఉదయం చేగుంట మండలం వడియారం శివారులోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద పడి విగత జీవిగా ఉన్నాడని పశువుల కాపరి సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి ముక్కుకు ముఖంకు గాయాలై చనిపోయాడు. మృతదేహాన్ని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ కార్మికుడు..

ఐడీఏబొల్లారం మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. యాదాద్రి భువనగిరికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి (43) ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తూ స్థానికంగా నివాసముంటున్నారు. శ్రీనివాస్‌రెడ్డి మద్యానికి బానిసగా మారాడు. మద్యం మత్తులో రెండుసార్లు ఆత్మహత్య చేసుకుంటానంటూ కుటుంబసభ్యులను బెదిరించారు. ఈనెల 9న ఇంట్లో కుటుంబసభ్యులు ఉండగానే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశారు. గమనించిన కుటుంసభ్యులు అప్పటికప్పుడు కిందికి దింపి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శ్రీనివాస్‌రెడ్డి మృతిచెందారు. మామ అంజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరు..



వడ్డె వెంకట్ (ఫైల్)

న్యాల్‌కల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చేపలు పట్టడానికి వెళ్లి మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన వడ్డెవెంకట్ మృతిచెందాడని హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రోజూ మాదిరిగానే హద్నూర్‌కు చెందిన వడ్డె వెంకట్ ఈనెల బుధవారం గ్రామ సమీపంలో గల చెరువు వద్దకు చేపలు పట్టడానికి వెళ్లాడు. ఆరోజు సాయంత్రం ఇంటికి తిరగిరాకపోవడంతో కుటుంబీకులు ఇరుగు పొరుగువారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం హద్నూర్ గ్రామంలోని చెరువులో వెంకట్ మృతదేహం నీటిలో తేలియాడుతు కనిపించింది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకట్ భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివవరించారు.



తెల్ల కుసుమతో తెగ లాభాలు

కోహీర్ మండలంలో సాగుకు రైతుల మొగ్గు

తక్కువ పెట్టుబడి.. నీటితో పంట

జొన్న, శనగలో అంతర్ పంటగా సాగు

కోహీర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తక్కువ పెట్టుబడి.. కొద్దిపాటి నీటితో సాగు చేసే పంటల్లో తెల్ల కుసుమ ఒకటి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండల పరిధిలో ఎక్కువగా ఉండే నల్లరేగడి భూముల్లో తెల్ల కుసుమ పంటను సాగు చేస్తున్నారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులకు మంచి లాభాలను తెచ్చిపెడుతుంది. మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరగడంతో మండల పరిధిలో ఆయా గ్రామాల్లో తెల్ల కుసుమ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

పూర్వ వైభవం

ప్రతీ ఏడాది సాధారణ సాగు విధానానికి స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల్లో పంటలను పండిస్తే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అందులో కుసుమ సాగు ప్రత్యేకం. కుసుమలో ఆయుర్వేద గుణాలు ఉండటంతో పూర్వం వైద్యంలో వాటిని వాడేవారు. దీంతో కోహీర్ మండల పరిధిలో పూర్వీకుల కాలంలోనే కుసుమ పంటను సాగు చేసేవారు. తెల్ల కుసుమలతో నూనె తీయించేందుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. తర్వాత కాలంలో వివిధ రకాల పంట నూనెలు రావడంతో తెల్ల కుసుమ సాగు కొంతవరకు కుంటుపడింది. కానీ, దశాబ్దకాలం నుంచి కుసుమలోని ఉపయోగాలపై అవగాహన పెరిగి మళ్లీ ఈ పంటకు పూర్వవైభవం సంతరించుకుంటుంది.

810 ఎకరాల్లో సాగు

కోహీర్ మండలంలో శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడి రైతులు కుసుమ పంట సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో దెబ్బతిన్న వానాకాలం పంటల స్థానంలోనూ కుసుమను సాగు చేస్తున్నారు. కోహీర్‌తో పాటు మండలంలోని కావేలి, పోతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి, పైడిగుమ్మల్, దిగ్వాల్, రాజనెల్లి, మద్రి తదితర గ్రామాల్లో నల్లరేగడి భూముల్లో రైతులు ఈ తెల్ల కుసుమ పంటను సాగు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో 810 ఎకరాల్లో తెల్ల కుసుమ సాగువుతోంది. జొన్న, శనగ పంటల్లో అంతర్ పంటగానూ సాగు చేస్తున్నారు. ఎకరా భూమిలో తెల్ల కుసుమలు సాగు చేసేందుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. ఈ పంట 120 నుంచి 130 రోజుల్లో కోతకు వస్తుంది. మార్కెట్‌లో క్వింటాల్ కుసుమలకు ప్రస్తుతం మంచి ధర పలుకుతుంది.



విత్తుకునే కాలం

ప్రతీ ఏడాది సెప్టెంబర్ రెండో వారం నుంచి నవంబరు నెలాఖరు వరకు కుసుమలు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నీరు నిలవని, తేమను పీల్చుకునే నల్లరేగడి, నీటి వసతి గల ఎర్ర గరప నేలలు అనుకూలంగా ఉంటుంది. ఎకరానికి 4 కిలోల చొప్పున వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, వరుసల్లో మొక్కల మధ్య 20 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి. తెల్ల కుసుమ పంట ఎండు తెగుళ్లను తట్టుకుని ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతుకు మంచి లాభం చేకూరుతుంది.

పట్టుదలతో సాగు

మీర్జాపూర్‌లో పదేళ్లుగా పట్టు పురుగుల పెంపకం

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌కు చెందిన ఎనకొండ వాణి, నారాయణరెడ్డి దంపతులు.. వారు వరి, మొక్కజొన్న, టమాటను సాగు చేస్తూ ఆరుగాలం కష్టపడ్డా ఫలితం కనిపించలేదు. ఇక లాభం లేదనుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించారు. మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకంపై మొగ్గు చూపారు. పట్టు వదలకుండా ధైర్యంగా ముందడుగు వేసి సాగును లాభదాయకంగా మార్చుకున్నారు. పదేళ్లుగా లాభాలను ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ దంపతులు.

నాలుగేళ్లుగా

ప్రభుత్వం నుంచి అందని ప్రోత్సాహకం

అయినా ధైర్యంతో ముందడుగు

లాభాలను ఆర్జిస్తున్న దంపతులు



హుస్నాబాద్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న వాణి, నారాయణరెడ్డి దంపతులు తమకున్న వ్యవసాయ భూమిలో అందరిలాగే సంప్రదాయ పంటలను సాగు చేసేవారు. ఇందులో శ్రమ, వెట్టిచాకిరి తప్ప లాభాలు రాకపోవడంతో ఇతర పంటలను సాగు చేయాలనుకున్నారు. సెరీకల్చర్ మండల అధికారి ఇచ్చిన సలహా మేరకు పట్టు సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. పట్టుసాగుపై అవగాహన లేకపోయిన ఇతర ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతులను ఆదర్శంగా తీసుకున్నారు. కొంతమేరకు అవగాహన తెచ్చుకున్నారు. తమకున్న ఐదు ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం ప్రారంభించారు. మొదట బెంగూళూర్ నుంచి 150 పట్టు గుడ్లను తీసుకొచ్చి పెంపకం చేశారు. మొదటిసారిగా 130 కిలోల దిగుబడిని సాధించగా, అంతగా లాభాలు రాలేదు. అయినా, పట్టు వదలకుండా.. మొక్కవోని ధైర్యంతో మరిన్ని మెలకువలను నేర్చుకుని పట్టు సాగును చేపట్టారు. ఐదెకరాలను రెండు భాగాలుగా చేసుకుని ఓ భాగంలో మల్బరీ తోటను పెంచడం ప్రారంభించారు. మరో భాగంలో పట్టు పురుగుల పెంపకం చేపట్టారు. చేస్తు నెల నెలా డబ్బులు సంపాదించడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి నెలనెలా డబ్బులు సంపాదించడం మొదలుపెట్టారు. ఇలా పదేళ్లుగా పట్టు వీడకుండా సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు.

ఏటా రూ.8 లక్షల వరకు సంపాదన

తొలుత వాణి, నారాయణరెడ్డి దంపతులు తమ ఇద్దరి పిల్లల పోషణ కోసం మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకాన్ని ప్రారంభించినప్పటికీ, రానురాను కష్టంగా కాకుండా ఇష్టంగా మలుచుకున్నారు. ఆటంకాలను అధిగమించి లాభాల వైపు అడుగులు వేశారు. అన్ని ఖర్చులు పోను ఏడాదికి రూ.8 లక్షల వరకు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకోవడమే కాదు, తమ పిల్లలను ఇంజనీరింగ్ చదువులు చదివిస్తున్నారు. అయితే, పట్టు పురుగుల సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహంగా అందించాల్సిన ఇన్‌సెంటివ్‌ను నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు. దీంతో రైతులు పట్టుసాగుపై ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రోత్సాహకాన్ని సకాలంలో అందిస్తే రైతులు మరింత ఉత్సాహంతో పట్టుసాగు వైపు మొగ్గుచూపుతారు.



మీర్జాపూర్‌లో మల్బరీ తోట, మార్కెట్‌కు తీసుకెళుతున్న పట్టు గూళ్లు

ఇష్టంగా సాగు చేస్తున్నాం

పట్టుసాగును ఇష్టంగా మలుచుకున్నాం. మా పొలంలో ఇతర పంటలను సాగు చేస్తే నష్టాలు తప్ప లాభాలు లభించలేదు. 2015లో పట్టు సాగుపై ఆసక్తి చూపాం. మొదటి ఏడాది ఇతర పంటల కంటే కొంత లాభం కలిగింది. పదేళ్లుగా పట్టుదలతో పట్టును సాగు చేస్తున్నాం. వచ్చిన లభాలతో మా పిల్లలను ఇంజనీరింగ్ చదివిస్తున్నాం. మమ్ములను చూసి మా గ్రామంలో ఇతర రైతులు పట్టు సాగు చేసేందుకు ముందుకు చ్చారు. అయితే, ప్రభుత్వం ప్రోత్సాహక డబ్బులు ఇవ్వడం లేదు. దాదాపుగా మాకు రూ.6 లక్షల ఇన్‌సెంటివ్ ఇవ్వాల్సి ఉంది.

- ఎనకొండ వాణి

స్మారక స్థలాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

సాయుధ పోరాటయోధుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్‌రూరల్, మార్చి 14 : మహ్మదాపూర్ అమరుల స్మారక స్థలాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి కోరాఉ. నాటి నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం నడిపి అసువులు బాసిన అమరుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. దీని కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి 77 వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. హుస్నాబాద్‌లోని మహ్మదాపూర్ గుట్టల వద్దకు సీపీఐ నాయకులు బైక్‌ర్యాలీగా అమరుల ఘాట్ వద్దకు చేరుకుని అమరుల స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలుస్తుందన్నారు. గ్రామీణ పేదలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పోరాడుతన్న పార్టీ సీపీఐ మాత్రమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పాటు పడుతుందే తప్పా ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల మధ్యన నిలిచి ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. నైజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల బానిస సంకెళ్ల విముక్తి కోసం తమ ప్రాణాలను త్యాగాలను చేసిన వీరుల చరిత్రను భవిష్యత్ తరకాలకు అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని చాడ వెంకటరెడ్డి కోరారు. సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిద్దిపేట, కరీంనగర్ జిల్లా కార్యదర్శులు మంద పవన్ అనభేరి ప్రభాకర్‌రావు కూతురు విప్లవ కుమారి, మహిళా సమాఖ్య నాయకులు గూడెం లక్ష్మి, పద్మ, పార్టీ నాయకులు, ప్రజానాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.



మహ్మదాపూర్ గుట్టల్లో అమరుల స్తూపం వద్ద జెండా ఎగురవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డ్రైనేజీ మరమ్మతు చేయించేది ఎవరు ?

- గ్రామపంచాయతీ, మల్లన్న ఆలయవర్గాల మధ్య సమన్వయ లోపం
- కొమురవెల్లి కోడెల స్తంభం సమీపంలో దెబ్బతిన్న పైప్‌లైన్
- రోడ్డుపై నుంచే మురుగు ప్రవాహం.. భక్తులు, స్థానికులకు ఇక్కట్లు



కోడెల స్తంభం ఆవరణ గుండా ప్రవహిస్తున్న మురుగునీటిలో సంచరిస్తున్న పందులు

చేర్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి గ్రామపంచాయతీ అధికారులు, మల్లన్న ఆలయాధికారుల సమన్వయ లోపం భక్తుల పాలిట శాపంగా మారింది. డ్రైనేజ్ కాలువ అస్తవ్యస్త నిర్వహణపై ఒకరిపై మరొకరు లోపాలను ఎత్తి చూపుకుంటూ చేతులు దులుపుకుంటుండటంతో భక్తులను మురుగు నీటి బెడద వెంటాడుతుంది ఆలయ పరిధిలోని కోడెల స్తంభం ఆవరణ గుండా డ్రైనేజీ నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి.

మల్లన్న ఆలయ పరిధిలోని వసతిగృహాలతో పాటు ఆలయ సమీపంలోని ప్రైవేటు ఇళ్ల మురుగు నీరు మళ్లింపునకు కొన్నాళ్ల క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో డ్రెయిన్ పైప్‌లైన్ నిర్మించారు. కానీ భవిష్యత్ అవసరాలను పరిగణించకుండా వేయడంతో తరచూ సమస్య ఉత్పన్నమవుతుంది. మల్లన్న దర్శనార్థం సాధారణ రోజులలో నిత్యం వందలాది మంది తరలి వస్తుండగా, జాతర సమయంలో శని, ఆదివారాలలో వేలాదిగా తరలివచ్చి బస చేస్తున్నారు. దీంతో సాధారణ రోజులకు భిన్నంగా నాలుగైదింతలు అధికంగా మురుగు నీరు ప్రవహిస్తుంది. నెలరోజుల క్రితం ఆలయ కోడెల స్తంభం సమీపంలోని వసతి గదుల ఆవరణ లోని పైప్‌లైన్ దెబ్బతిని వసతి గదుల ముందరి భాగం గుండా కోడెల స్తంభం ఆవరణ మీదుగా రోడ్డుపై నుంచి తోట బావి పార్కింగ్ ప్రదేశం వైపు ప్రవహిస్తూ వస్తుంది. మరమ్మతులు చేపట్టే విషయమై గ్రామపంచాయతీ చేస్తుందని ఆలయ వర్గాలు, ఆలయం వారు చేస్తారని గ్రామ పంచాయతీ వారు గాలికి వదిలేశారు. పైపులు, మెటీరియల్ అందిస్తామని ఆలయాధి కారులు తెలిపి సమకూర్చడంతో పంచాయతీ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం గోతులు తీశారు. తీరా సుమారు రూ.6లక్షలు అంచనా వ్యయం కానుండటంతో నిధులు లేవన్న కారణంగా తాము చేయలేమంటూ పంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల జరిగిన 8వ వారం జాతరకు భక్తులు భారీగా తరలివచ్చిన క్రమంలో మురుగునీరంతా పొంగిపొర్లింది. దీంతో భక్తులు అదేనీటిలో నడుచుకుంటూ ఆలయానికి చేరుకోవడంతో నానా తంటాలు పడ్డారు. రేపు జరగనున్న 9వవారం జాతరకు ఇదే దుస్థితి పునరావృతం కానుంది. ఈవిషయమై ఉన్నతాధికారులు చొరవ వహించి ఆలయాధి కారులు, పంచాయతీ అధికారులను సమన్వయపరిచి డ్రైనేజీ కంపుకష్టాలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతు న్నారు.



పైప్‌లైన్ కోసం గోతులు తీసి వదిలేసిన దృశ్యం

పట్టించుకోకపోవడం తగదు

నెలరోజులుగా డ్రైనేజ్ నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నా ఎవరికీ పట్టింపులేదు. భక్తుల మనోభావాలు, స్థానికుల ఆరోగ్యపరిస్థితులు ముడిపడిన అంశమైనప్పటికీ దేవాలయాధికారులు, పంచాయతీ అధికారులు మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదు. దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మరమ్మతులు చేపట్టని యెడల గ్రామం తరఫున కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- ఏర్పుల మహేశ్, కొమురవెల్లి

చేతులెత్తేశారు

కోడెల స్తంభం సమీపంలోని మురుగు నీటి పైప్‌లైన్ మరమ్మతులను ముందస్తుగా ఆలయాధికారులు సరిచేస్తామన్నారు. తీరా పంచాయతీ ద్వారా చేయాలని చేతులెత్తేశారు. ఎస్టిమేట్ వేయించడంతో సుమారు రూ.6 లక్షలు వ్యయం అవుతుందని తేలింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

- హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

మెటీరియల్ సమకూర్చాం

ఎక్కడైనా డ్రెయిన్ నిర్వహణ బాధ్యత పంచాయతీదే ఉంటుంది. కోడెల స్తంభం వద్ద పైప్‌లైన్ మరమ్మతుల కోసం రూ.5 లక్షలు అవుతాయని చెప్పడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తవద్దని చెరి సగం భరిద్దామని చెప్పాం. సుమారు రూ.2.50 లక్షల మెటీరియల్ సమకూర్చాం. కానీ పంచాయతీ అధికారులే మరమ్మతులు చేపట్టడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- రామాంజనేయులు, ఈవో

ముంబై సిద్ధివినాయకుడిని దర్శించుకున్న నీలం మధు





ముంబైలోని సిద్ధివినాయకుడి ఆలయంలో నీలం మధు, రుద్రారంలో పదో తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్, పెన్నులు అందజేస్తున్న ఎన్ఎంఆర్ యువసేన

పటాన్‌చెరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తన జన్మదినాన్ని పురస్కరించుకొని ముంబైలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సిద్ధి వినాయకుడిని శుక్రవారం కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆలయాలలో ముంబైలోని సిద్ధి వినాయక ఆలయం ఒకటని, తమ కోరికలు తీర్చుకునేందుకు దేశవ్యాప్తంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులవుతారని తెలిపారు. సాధారణంగా ప్రతీ గణేష్ ఆలయాల్లో వినాయకుడికి తొండం ఎడమవైపు ఉంటుందని కానీ, ఈ ఆలయంలో మాత్రం కుడివైపు ఉండడంతో పాటు తొండంలో మూడో కన్ను ఉంటుందన్నారు. ఇంతటి ప్రత్యేకత ఉన్న సిద్ధివినాయకుడిని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయన్నారు. తన జన్మదినం సందర్భంగా వినాయకుడిని దర్శించుకున్నానన్నారు. ఆ సిద్ధి వినాయకుడు ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అభిమానుల సేవాకార్యక్రమాలు

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు పలుచోట్ల నీలం అభిమానులు బర్త్ డే కేకులను కట్ చేసి సంబరాలు జరుపుకోవడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు జరిపించారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నీలం మధు స్వామి వారి ఆశీస్సులతో నిండు నూరేళ్ల సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. జిన్నారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఊట్ల గ్రామంలో వేడుకలు నిర్వహించారు. పటాన్‌చెరులో ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. రుద్రారంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు మన్నె ప్రశాంత్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్, పెన్నులు అందించారు. గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం దాచర్లపల్లి, సిరిసిల్ల జిల్లా మాడేపల్లిలో ఎన్ఎంఆర్ అభిమానుల అనాధాశ్రమలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేయడంతో పాటు ఆసుపత్రి ఆవరణలో కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు.


శివ్వంపేట, : గూడూరు హోలీ సంబరాల్లో మహిళలు


జహీరాబాద్ పట్టణంలో


రామచంద్రారెడ్డినగర్ కాలనీలో


నర్సాపూర్ : కశ్మీర్ నుంచి మహ్మదాబాద్‌తండాకు వచ్చి హోలీ ఆడుతున్న ఎఫ్‌సీఐ జీఎం చత్రునాయక్

రంగుల కేళీ



హోలీ సంబరాలు అంబారన్నంటాయి. డీజే పాటలు, చిన్నారులు, యువత కేరింతల మధ్య రంగుల కేళీ సాగింది. ప్రజలు రంగుల్లో తడిసి ముద్దయ్యారు. ఆదివారం రాత్రి కామ దహన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉట్లు కొట్టడం, రాతి గుండలను ఎత్తుట వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్‌తండాకు చత్రునాయక్ కశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎఫ్‌సీఐలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ప్రత్యేకంగా హోలీ ఆడేందుకు కుటుంబ సమేతంగా గ్రామానికి వచ్చి సొంతూరుపై అభిమానాన్ని చాటారు.

-న్యూస్ నెట్‌వర్క్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)


ఖేడ్‌లో హోలీ వేడుకల్లో ఉట్టి కొడుతున్న పద్మశాలీలు


కోహీర్‌లో యువకులు, చిన్నారులు


కల్హేర్ మండలం క్రిష్టాపూర్‌లో


ఐడీఏ బొల్లారంలో యువతుల కేరింత...


హోలీ వేడుకల్లో నృత్యం చేస్తూ..


చిన్నశంకరంపేటలో


జహీరాబాద్ పట్టణంలో చిన్నారులు..

అనంత పద్మనాభస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ


సన్మాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు

పాపన్నపేట,మార్చి 14.(ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట మండలంలోని కొత్తపల్లిలో నిర్వహిస్తున్న అనంత పద్మనాభ స్వామి జాతరకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శుక్రవారం భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మైనంపల్లి హన్మంతరావును శాలువాతో సత్కరించి స్వామి వారి మెమెంటోనూ అందజేశారు. అనంతరం అన్నప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గోవిద్ నాయక్, కొత్తపల్లి సోసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ మల్లప్ప, సత్యనారాయణ, నాయకులు సందీప్, సంతోష్‌గౌడ్, అజయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక నిల్వ


ఫరీద్‌పూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

హవేళీఘణపూర్, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అక్రమ ఇసుక దందాకు అడ్డులేకుండా పోతుంది. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రవహించే నీటిని సైతం లెక్క చేయకుండా నది ఒడ్డున ఇసుకను డంపు చేస్తున్నారు. మండలంలోని ఫరీద్‌పూర్ గ్రామ శివారులోని మంజీర నదిలో అక్రమార్కులు సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను నిల్వ చేశారు. పారుతున్న నీటిలోంచి జేసీబీ సాయంతో తీసి నదిలోని ఎత్తైన ప్రాంతంలో డంపు చేసి పెట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. కప్రాయిపల్లి తండా, దూప్‌సింగ్ తండాలో నిత్యం రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారుల నిఘా కొరవడడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ


నిరసనదీక్ష చేపడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు

జహీరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదింపజేసి అమలులోకి తెచ్చేవరకు తమ పోరాటం ఆగదని ఎంఎస్‌పీ జిల్లాఅధ్యక్షుడు అబ్రహం మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో జరిగిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగల ఉద్యమాన్ని అణచివేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఉద్యోగాల నియమకాల్లో మాదిగలతోపాటు అన్నికులాలకు న్యాయం జరుగాలనే ఉద్దేశంతో ఆందోళనలు చేస్తున్నామన్నారు. ఎస్సీ కేటగిరిలోని ఉద్యోగాలన్ని మాలలకే దోచి పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్రచేస్తున్నారని ఆరోపించారు. మాదిగలకు ద్రోహం చేస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ అందక పరేషాన్

- బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం
- ఇంకా దుకాణాలకే చేరని వైనం

అల్లాదుర్గం,మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పక్షం రోజులైనా రేషన్ బియ్యం అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలకుగాను 21 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెలా చివరిలోగా రేషన్ దుకాణాలకు బియ్యం చేరుకోవాల్సి ఉంటుంది. మార్చి నెలకు సంబంధించి ఫిబ్రవరి 28లోపే సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటికీ దుకాణాలకు చేరుకోలేదు. కేవలం బహిరన్‌దిబ్బ, చేవెళ్ల, ఐబి గిరిజన తండాలోని షాపులకు మాత్రమే బియ్యం సరఫరా చేశారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ పనులు మానుకొని ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రతి నెలా 1 నుంచి 15 తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఈ నెలకు సంబంధించి ఈ ఒక్క రోజు గడువు ఉండటంతో బియ్యం అందుతాయా.. లేదా అన్న విషయమై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తక్షణమే దుకాణాలకు బియ్యం సరఫరా చేసి ఈ నెలాఖరు వరకు బియ్యం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఘనంగా మహా పడిపూజ

తూప్రాన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం ఉత్తర నక్షత్రం పురస్కరించుకొని శ్రీమణికంఠ స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వామికి మహా అభిషేకం నిర్వహించారు. అనంతరం మహా పడిపూజ ఘనంగా చేట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, బజారు రుపేశ్, బస్వన్నగారి సత్యనారాయణగౌడ్, ఆంజాగౌడ్, మాచిరెడ్డి కిష్టారెడ్డి, మాలె శ్రీనివాస్, మాలె సంతోష్‌కుమార్, కొడిప్యాక నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

కల్హేర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చిన్నారిని చితకబాదిన ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గురుకులంలో ఆందోళనకు దిగారు. సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కేతావత్ దశరథ్, శాంతాబాయి దంపతుల కుమార్తె అనురాధ సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో ఒకటో తరగతి చదువుతుంది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం స్రవంతి చిన్నారి పట్ల అమానుషంగా ప్రవర్తించి చితకబాదడంతో వీపుపై దద్దుర్లు వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ సంఘటన రెండు రోజుల క్రితం జరిగినప్పటికీ సమాచారం అందించలేదని ఆరోపించారు. ఈ విషయమై ఇందుజా అనే టీచర్‌ను వారు నిలదీయగా, ఈ విషయం తమకు తెలియదని ప్రిన్సిపాల్ వచ్చాక ఆమె దృష్టికి తీసకువెళతామని తెలిపారు


నర్సాపూర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన

నర్సాపూర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నర్సాపూర్‌లో స్థానిక నాయకులు ప్రధాన రోడ్డుపై నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, సురారం నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, నాయకులు హుస్సేన్, జ్ఞానేశ్వర్, నాగరాజుగౌడ్, రాజేష్, సలీం, అలీ, ఇర్ఫాన్, మాణయ్య, విఠల్, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా యంత్రతంత్ర త్రిశూలాల ప్రాణ ప్రతిష్ఠ


హోమ కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు

నారాయణఖేడ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివార్ సందు తండాలోని దక్షణకాళి సేవాలాల్ ఘడ్ ఆలయంలో హోలీ పండుగలో భాగంగా శుక్రవారం ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహారాజ్ ఆధ్వర్యంలో 250 టన్నుల యంత్రతంత్ర త్రిశూల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజలు, 121 మంది కన్యలతో అభిషేకం, 11,111 మంది మహిళలతో పూజ, 121 హోమాల కార్యక్రమాలు నిర్వహించారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చెందిన హరినాథ్ మహారాజ్ ఆధ్వర్యంలో సప్తాహ నిర్వహించారు. జగదీశ్వరానంద్ మహారాజ్ మాట్లాడుతూ యంత్ర తంత్ర త్రిశూలాన్ని దర్శించుకుంటే పాపాలు తొలగిపోయి మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దిశ కమిటీ జిల్లా సభ్యులు ప్రకాష్ రాథోడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు నెహ్రూనాయక్ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన పలు ఆశ్రమాల పీఠాధిపతులు, ఆయా రాష్ట్రాల గిరిజన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

సంగారెడ్డి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : దోపిడీని అరికట్టేందుకే కారల్ మార్క్స్ సిద్ధాంతాలు ఇంకా బతికే ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం కారల్ మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి వర్గాన్ని మార్క్స్ తన రచనలతో అణచివేశారని అన్నారు. మోదీ ప్రభుత్వం దోపిడిదారులకు కొమ్ముకాస్తు దేశంలో ప్రజల మధ్య అంతరాలు తీవ్రంగా పెంచిందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, జీ. సాయిలు, నర్సింహులు, నాయకులు నాగేశ్వరరావు, ప్రవీణ్, మహిపాల్ రేవంత్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కారల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

చంద శ్రీధర్‌కు ఉగాది పురస్కారం

సంగారెడ్డి అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చందశ్రీధర్‌కు ఉగాది పురస్కారం లభించింది. సమాజ సేవలో ముందు వరుసలో ఉన్న వారిని గుర్తించి శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీ తార ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో ఉగాది పురస్కారంతో సన్మానించింది. బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా చంద శ్రీధర్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చందశ్రీధర్ మాట్లాడుతూ తారా ఆర్ట్స్ అకాడమీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


పురస్కారం అందుకున్న చంద శ్రీధర్

డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించండి

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


డీఎస్పీ సత్తయ్య, సీఐ రమేష్‌లకు సూచనలిస్తున్న ఎస్పీ

సంగారెడ్డి క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణ కోసం డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసులకు సూచించారు. హోలీ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో శుక్రవారం పోలీసులు నిర్వహిస్తున్న బందోబస్తు ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐ రమేష్‌లకు పలు సూచనలు చేశారు. పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సంగారెడ్డి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : బంజారా ఇంజినీరింగ్ 1998-2022 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు హోలీ పండుగ సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు పూర్వ విద్యార్థులు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీఎస్ వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నర్సాపూర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి రుస్తుంపేటలోని ఎంపీపీఎస్‌లో గురువారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మండల విద్యాధికారి తారాసింగ్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దాయిపేటలో ఇఫ్తార్ విందు



పుల్‌కల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాయిపేట గ్రామంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్, జోగిపేట ఏఎంసీ డైరెక్టర్ కమల్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కులమతాలకతీతంగా పండుగ జరుపుకోవడంలోనే నిజమైన సంతోషం ఉందని, భగవంతుడు ప్రజలందరినీ సుఖ సంతోషాలతో ఉంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖాదర్ పాషా, సలీం పాష, జాకీర్ పాషా, పాషా పటేల్, మక్బూల్ పటేల్, అలీ మొద్దీన్, జావిద్ పాషా, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.